క్లుప్తంగా

రెవెన్యూ సదస్సును తనిఖీ చేసిన కలెక్టర్



అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సును గురువారం సాయంత్రం కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. సదస్సులో ఫిర్యాదులు అందజేసిన రైతులతో మాట్లాడారు. భూముల సమస్యలపై ఫిర్యాదు చేసే వారు తగిన పత్రాలను అధికారులకు అందజేయాలని సూచించారు. సదస్సులో వచ్చిన ఫిర్యాదులను పారదర్శకంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, మదన్‌మోహన్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అక్రమ ఇసుక డంపులు సీజ్

చిన్నచింతకుంట: మండలంలోని సీతారాంపేట గ్రామ చిన్న వాగు నుంచి కొందరు అక్రమార్కులు అక్రమంగా ఇసుకను తరలించి గోప్యానాయక్ తండా శివారులో డంపు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎల్లయ్య గురువారం ఇసుక డంపులను పరిశీలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలింపు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పలువురు ఉన్నారు.

గోశాలకు గడ్డి అందజేత



దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు పలువురు గడ్డిని అందజేస్తున్నారు. గురువారం దేవరకద్రకు చెందిన భక్తులు అరుణ్‌కుమార్, వెంకటేశ్‌లు చెరో ట్రాక్టర్ గడ్డిని దేవాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన పూజారి నాగరాజు వారు పంపిన గడ్డిని గోశాలకు చేర్చారు.


ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

స్టేషన్ మహబూబ్‌నగర్: గత పదేళ్లలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న ఉద్యోగ వ్యతిరేక చర్యలపై నోరుమెదపని వారు ఈ రోజు ఉద్యోగుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం స్పందన పట్ల అసంతృప్తింగా ఉన్నా గత 16 నెలలుగా అత్యంత పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు, బదిలీలు, పదోన్నతులు నిర్వహించారని తెలిపారు. ఆర్థిక సమస్యల పరిష్కారం మిగిలి ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తూ పదేళ్లలో కేవలం 5 శాతం ఐఆర్ ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. మొదటి పీఆర్‌సీలో 36 నెలల ఐఆర్ ఎగ్గొట్టారని, అప్పుడు స్పందించని బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు గగ్గోలు పెట్టడం మానుకోవాలని హితవుపలికారు.

ఇసుక అనుమతి రద్దు చేయాలని ధర్నా

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారులో ఇచ్చిన ఇసుక అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ అధికారులు, అధికార పార్టీకి తొత్తులుగా మారారని ఆరోపించారు. రైతులను దృష్టిలో ఉంచుకోని ప్రభుత్వం ఇచ్చిన అనుమతిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాజుకు వినతి పత్రం ఇచ్చారు.

వేదమంత్రాలతో మార్మోగిన లోకిరేవు



నవాబుపేట: వేదమంత్రాలతో మండలంలోని లోకిరేవు గ్రామం మార్మోగింది. ఈ సందర్భంగా వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం వేదమంత్ర పారాయణం, భద్రకాళి, వీరభద్రస్వామి వార్ల ప్రత్యేక అభిషేకం అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం మహా మంగళహారతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగించనున్నట్లు దేవాలయ పూజారులు లింగయ్యస్వామి, వీరభద్రయ్య స్వాములు తెలిపారు.

గన్నీ బ్యాగుల కొరత



సంచులు లేక కొనుగోలు కేంద్రాల్లో కప్పి ఉంచిన ధాన్యం

- పాత సంచుల సరఫరా
- సగానికి పైగా చిరిగినవే
- వర్ష భయం.. ఆరు బయటే ధాన్యం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

గండేడ్: కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడింది. ప్రతి ఏటా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం వాటి ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుంది. ఈఏడాది కూడా అదే తరహాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన రైతులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం ఎక్కడ ఇబ్బందులు రావద్దని చెప్తున్నా సమస్యలు మాత్రం తప్పడం లేదు. గండేడ్ మండలంలో 19 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి, రంగారెడ్డిపల్లి, లింగాయిపల్లి, గండేడ్, రెడ్డిపల్లి, పెద్దవార్వాల్, జక్లపల్లి తదితర గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై దాదాపు నెల రోజులు కావస్తున్నది. ధాన్యం ఎక్కువ మొత్తంలో కేంద్రాలకు వస్తోంది. అందుకు తగ్గట్టుగా గన్నీ బ్యాగులు మాత్రం సరఫరా చేయడం లేదు.

సగానికి పైగా చిరిగినవే..

కొనుగోలు కేంద్రాలు ప్రారంభంలో అన్ని సెంటర్లకు కొత్త గన్నీ బ్యాగులు ఐదు వేల చొప్పున సరఫరా చేశారు. రెండో విడత మాత్రం అన్ని వాడిన బ్యాగులనే పంపిణీ చేస్తున్నారు. వాటిలో సగానికి పైగా పనికిరాని, చిరిగిన బ్యాగులే ఉంటున్నాయి. వెన్నాచేడ్ కేంద్రానికి మొదటగా 5వేలు కొత్త బ్యాగులు రాగా, రెండో సారి 10వేలు పాత బ్యాగులు వచ్చాయి. ఈ పాత బ్యాగుల్లో మూడు నాలుగు వేల బ్యాగుల కంటే ఎక్కువ వాడకానికి రాలేదు. మిగతావన్ని పక్కన పడేశారు. ఇలా ప్రతి కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



వెన్నాచేడ్‌లో చినిగిన సంచులు

ఆరు బయట ధాన్యం – వర్షం భయం..

పండించిన పంటను తీసుకొచ్చి కొనుగోలు కేంద్రాల్లో పోశారు. సంచులు లేక దాదాపు వారం రోజులుగా ఆయా కేంద్రాల్లో ధాన్యం తూర్పు పట్టి తూకానికి సిద్ధం చేశారు. సంచుల గురించి కేంద్రం నిర్వాహకులను అడిగితే అధికారులకు చెప్పామని సమాధానం ఇస్తున్నారు. అధికారులను అడిగితే ఈరోజు రేపంటూ చెబుతున్నారు. ఓవైపు సాయంత్రం కాగానే వాతావరణంలో మార్పులు రావడం, ఉరుములు మెరుపులు రైతులను బెంబేలెత్తేస్తున్నాయి. అకాల వర్షాలతో చాలా చోట్ల ధాన్యం తడిసి ముద్దవుతోంది. ఇప్పుడు కూడా ఎప్పుడు వర్షం వస్తుందోనని రైతుకు కంటిమీద కునుకు కరువవుతోంది. దీంతో రైతులు నానా పాట్లు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అన్ని కేంద్రాలకు సరిపోయిన గన్నీ బ్యాగులను అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

వారం రోజులుగా ఎదురు చూస్తున్నాం



ఐదు ఎకరాల్లో వరి పంట పండించాం. పంట కోసి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ధాన్యాన్ని ఆరబెట్టాం. తూర్పు కూడా పట్టాం. వారం రోజులుగా సంచుల కోసం ఎదురు చూస్తున్నాం. అడిగితే అధికారులకు చెప్పాం, ఈరోజు వస్తాయి రేపు వస్తాయి అని చెపుతున్నారు. సాయంత్రం కాగానే వర్షం వచ్చి ఎక్కడ ధాన్యం తడుస్తుందేమోనని భయపడుతున్నాం. సంచులు వెంటనే ఇవ్వాలి.

– పులగారి బాలయ్య, రైతు, వెన్నాచేడ్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అవసరం ఉన్నాయని ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు సమాచారం ఇస్తూనే ఉన్నాం. పనికిరాని సంచులు కాకుండా మంచివి ఇవ్వాలని కూడా అధికారులకు చెప్పాం. అక్కడి నుంచి రాగానే కొనుగోలు కేంద్రాలకు అందజేస్తాం.

– బాలకృష్ణ, ఏపీఎం, గండేడ్

‘కల్యాణలక్ష్మి’ చెక్కుల పంపిణీ



గండేడ్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గండేడ్ మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ మాధవి, గండేడ్, మహమ్మదాబాద్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



జడ్చర్ల టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డా.చంద్రకళకు వినతిపత్రం సమర్పించారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇప్పించాలని ఆమెను కోరారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు కృష్ణ, జానకీరాం, ఈశ్వర్‌రావు, జహంగీర్ బాష, సోయబ్, శశికళ, ప్రతిభ, కవిత, ఎవెంజిలిన్, జ్యోతి పాల్గొన్నారు.

పీఆర్ ఉద్యోగుల సమ్మేళనానికి హర్షవర్ధన్‌రెడ్డికి ఆహ్వానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హైదరాబాద్‌లో శుక్రవారం జరిగే పంచాయతీ రాజ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి పీసీసీ అధికార ప్రతినిధి నేత హర్షవర్ధన్‌రెడ్డికి తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ ఆహ్వానం పలికారు. గురువారం తన ఇంట్లో కలిసి ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాని కోరారు. 2019నుంచి హర్షవర్ధన్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు అన్ని విధాలుగా అండగా ఉన్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి సమస్యనైన ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేశారని, అలాంటి వ్యక్తి సమ్మేళనానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గండీడ్ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు హాజీ ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



నవాబుపేట: మండలంలో కొనసాగుతున్న ఉపాధి కూలీ పనులకు కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని కాకర్లపహాడ్, రుద్రారం గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులలో భాగంగా భూగర్భ జలాలు పెంపొందించేలా పనులు ప్రత్యేకంగా చేపట్టాలని సూచించారు. అందుకు గాను పారంపండ్లను రైతులు తవ్వుకోవాలని వివరించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ భద్రునాయక్, ఏపీఓ జ్యోతి, తదితరులు ఉన్నారు.

దేశం గర్వించేలా ‘సిందూర్’ విజయవంతం



మిడ్జిల్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు

మిడ్జిల్: పాకిస్తాన్‌లో ఉగ్ర స్థావరాలపై భారత్ దాడి చేసి ప్రపంచ దేశాలు గర్వించే విధంగా సిందూర ఆపరేషన్ విజయవంతం కావడంపై గురువారం సాయంత్రం మిడ్జిల్ మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు, అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య, గౌస్, సాయిలు, రాజేశ్వర్, శేఖర్, మల్లికార్జున్, జహంగీర్, ఉస్మాన్, జహీర్, నరేందర్, శివ పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

జడ్చర్ల టౌన్: పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో భారత ఆర్మీ క్షేమంగా ఉంటూనే ఉగ్రవాదులను తుదముట్టించాలని కోరుతూ గురువారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ హనుమాన్ దేవాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

రాజాపూర్(బాలానగర్): జాతీయ ఉపాధిహామీ పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు అలసత్వం వహించకుండా పనులను పూర్తి చేయాలని బాలానగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో గ్రామాల్లో చేయాల్సిన పనులు పాంపండ్, సోప్‌ఫిట్స్, క్యాటిల్‌షెడ్, గోట్‌షెడ్ వంటివి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్దేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఇచ్చిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పట్టా భూముల్లో ఇసుకకు అనుమతి

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పట్టా భూములలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక రవాణాకు అనుమతి తన చేతులలో లేవని, జిల్లా అధికారుల నుంచి ఇవ్వడం జరిగిందని తెలిపారు. దుందుభీ వాగు నుంచి ఇసుక తవ్వడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న రహదారి 12 ఏళ్ల క్రితం రైతుల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రహదారిని వినియోగించుకోవాలని సూచించారు. కొత్తపల్లి పట్టా భూములకు సంబంధించిన ఇసుక తవ్వకాల పైన ఏమైన అభ్యంతరాలు ఉంటే పై అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని, ఇసుక అనుమతి నిలుపుదల చేయుటకు తనకు ఏవిధమైన అధికారం లేదని తెలిపారు.



జడ్చర్లలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, నాయకులు



మిడ్జిల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విలేకర్లు



దేవరకద్రలో నల్లబ్యాడ్జీల ధరించి నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

పత్రికాస్వేచ్ఛపై కక్ష సాధింపు సరికాదు

- సాక్షి ఎడిటర్ ఇంటిపై దౌర్జన్యం అప్రజాస్వామికం
- నల్ల బ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతి

సాక్షి, నెట్‌వర్క్: సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేయడం అప్రజాస్వామికమని జడ్చర్ల, దేవరకద్ర, మిడ్జిల్, చిన్నచింతకుంట, నవాబ్‌పేట మండల కేంద్రాల్లో జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆయా మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. జర్నలిస్టుల నిరసనకు ఆయా ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. పత్రికా స్వేచ్ఛపై కక్ష సాధింపు చర్యలు సరికాదని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. మిడ్జిల్ మండలంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ నాయకులు, సభ్యులు, విలేకర్లు, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘భూ భారతి’తో సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



కొమిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: ధరణితో భూముల సమస్యలు పెరిగినందున దాని స్థానంలో తమ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చి భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూగ్రామ సభలో అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అప్పనంగా భూములను దోచుకునేందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని నలుగురు వ్యక్తులు చేసిన చట్టమే ధరణి అని విమర్శించారు. ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో కలిపేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడే భూ భారతి చట్టాన్ని తెచ్చినట్లు తెలిపారు. భూ భారతి చట్టంతో మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేల భూ భాగోతాలు బయట పెడతామని హెచ్చరించారు. రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులో హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్‌బుక్కులు లేకపోవడం వంటి వాటిని సదస్సుల్లో అధికారులు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అడ్డాకుల, మూసాపేట మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే జీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, బగ్గి కృష్ణయ్య, నిరంజన్, సంతోషి, రాంచందర్, సాయిరెడ్డి, బాలరాజు, మశ్చందర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరపున నిరంతరం పోరాటం

- ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేంద్రచారి
- ప్రెస్ క్లబ్ బృందానికి సన్మానం



నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజా సమస్యలను వెలికి తీయడంలో నిరంతరం పోరాటం చేస్తామని మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేంద్రచారి అన్నారు. గురువారం స్థానిక బుద్ధభవన్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులను సన్మానించారు. 20 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రెస్‌క్లబ్ రూపురేఖలు మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని అధ్యక్షుడు నరేంద్రచారి అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం పని చేస్తామన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో మీడియాది ప్రధాన భూమికని, అను నిత్యం సమాజాన్ని జాగృతం చేయడంలో, సమాజాన్ని చైతన్య పరచడంలో, సమాచారాన్ని చేరవేయడంలో మీడియాది ప్రముఖ పాత్ర అన్నారు. కార్యక్రమం ప్రజా సంఘాల ఐక్యవేదిక కో కన్వీనర్లు నాచ శ్రీనివాస్ యాదవ్ గోపాలకృష్ణ, కృష్ణ యాదవ్, బుర్ర సురేష్, రామలింగం, రమేష్, యాదవ్, వెంకటేష్, సంతోష్, వెంకట్ రాములు అరుణ్‌కుమార్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు ధరణీకాంత్, వెంకటేష్, జాయింట్ సెక్రటరీలు సతీష్, కృష్ణ, మణిప్రసాద్, సభ్యులు మోహన్ దాస్, రాంకొండ, అహత్ షాబుద్దీన్, రమణ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ డీలర్లకు ఈపీఓఎస్ మిషన్ల పంపిణీ



ఈపీఓఎస్ మిషన్ల పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

జడ్చర్ల టౌన్: జడ్చర్ల వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఎంఎఫ్‌ఎంఎస్ ఐడీ కలిగిన 45మంది డీలర్లకు ఈపీఓఎస్ మిషన్లను పంపిణీ చేశారు. మండలంలోని మల్లెబోయిన్‌పల్లి రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ వాటిని డీలర్లకు అందజేశారు. బయోమెట్రిక్ ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్‌యంత్రం మిషన్ ద్వారా వ్యాపారం పారదర్శకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయులు, మండల అధికారి గోపినాథ్, కోరమండల్ ఎరువుల కంపెనీ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు లింగన్న

హన్వాడ: త్వరలో జరిగబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మండల నాయకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. త్వరలో జరగబోయే పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు కొండ లింగన్నను శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు. మండలంలో ప్రజా సమస్యలను ఎంపీ డీకే అరుణమ్మ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడుతానని ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు లింగన్న వివరించారు. మండలంలో పార్టీ వైభవానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండబుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ వడ్లశేఖర్, ఎఫ్‌ఏసీఎస్ వైస్‌చైర్మన్ కృష్ణయ్యగౌడ్, మండల నాయకులు కొండబాలయ్య, జుక్క్య, చెన్నప్ప, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిడ్నాప్ అయిన బాలుడిని తల్లికి అప్పగింత



మహబూబ్‌నగర్ క్రైం: తల్లి ఒడిలో నుంచి కిడ్నాప్ చేసిన ఏడాది బాలుడిని టూటౌన్ పోలీసులు 24గంటల్లో బాలుడిని రక్షించి తల్లికి అప్పగించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామానికి చెందిన అరుణ కొన్ని రోజుల నుంచి తన ఇద్దరూ పిల్లలతో కలిసి రైల్వే స్టేషన్ సమీపంలో బిక్షాటన చేస్తూ అక్కడే పడుకుంటుంది. ఈనెల 6న రాత్రి స్టేషన్ బయట ఉన్న పుట్‌పాత్‌పై అరుణ ఐదేళ్ల బాలికతో పాటు ఏడాది బాబుతో కలిసి నిద్రపోయింది. ఈనెల 7న ఉదయం 5గంటల ప్రాంతంలో నిద్రలేచి చూసే సరికి పక్కన బాబు లేకపోవడంతో ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా రెండు బృందాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కిడ్నాప్ చేసిన శివరాజ్ అనే వ్యక్తిని గుర్తించారు. పట్టణానికి చెందిన శివరాజ్ గతంలో బాలుడి తల్లి అరుణ బిక్షాటన చేస్తూ కల్లు తాగి బాలుడిని సక్రమంగా చూసుకోవడం లేదని పలుమార్లు గమనించి మంచిగా చూసుకోవాలని ఆమెను హెచ్చరించాడు. అయిన ఆమె బాలుడి విషయంలో నిర్లక్ష్యంగా ఉండటంతో బాలుడిని కిడ్నాప్ చేసి అతనికి ఉన్న ఇద్దరి పిల్లలతో పాటు కిడ్నాప్ చేసిన బాబును పెంచుకోవాలని అనుకున్నాడు. కిడ్నాప్ చేసిన తర్వాత బాలుడిని తెలిసిన మహిళ ఇంట్లో పెట్టాడు. కానీ ఆ తర్వాత బాలుడు ఏడుస్తాడమో ఇబ్బంది అవుతుందని తెలుసుకున్నాడు. దీంతో బాలుడిని టవల్‌లో చూట్టి రైల్వే స్టేషన్ ఎదుట పార్క్ చెట్లలలో పెట్టి అక్కడే అనుమానంగా తిరుగుతుంటే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి బాలుడిని రక్షించి తల్లికి అప్పగించినట్లు సీఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని వెల్లడించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నాన్‌టీచింగ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘం నాయకులు పీయూ వీసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కార్యవర్గంలో అంతర్గత కుమ్ములాటల వల్ల, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, వేతనాలను పెంచాలని కోరారు.